సంక్షేమం చూసి ఓటేయండి

- ఒంగోలు 45వ డివిజన్‌లో పర్యటించిన బాలినేని శచీదేవి



నాగేంద్రనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బాలినేని శచీదేవి

ఒంగోలు: వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పరిపాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చూసి ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి కోరారు. స్థానిక 45వ డివిజన్‌లోని నాగేంద్రనగర్‌లో శనివారం మహిళలతో మమేకం–స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల గురించి ఆరా తీస్తూ వారి విజ్ఞప్తులను ఆలకిస్తూ శచీదేవి ముందుకు సాగారు. ప్రతి ఇంటి వద్ద ఆమెను ఆప్యాయంగా ఆహ్వానిస్తూ ప్రజలు తమ అభిమానాన్ని చాటుకున్నారు. గతంలో ఏ సమస్య వచ్చినా పట్టించుకునే నాథుడు ఉండేవాడు కాదని, రేషన్ కార్డు కావాలంటే ఎంఆర్‌వో ఆఫీసు, కలెక్టర్ కార్యాలయం చుట్టూ ఏళ్ల తరబడి తిరగాల్సి వచ్చేదని స్థానికులు గుర్తుచేసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నేడు అటువంటి సమస్యే లేదన్నారు. రేషన్ కార్డు, పెన్షన్ దరఖాస్తు చేసుకోగానే వచ్చిందంటూ ఓ వృద్ధ మహిళ ఆనందం వ్యక్తం చేసింది. చంద్రబాబు హయాంలో గతంలో ఆస్పత్రిలో ఓపీకి సైతం డబ్బులు పెట్టారని, నేడు ఆస్పత్రికి వెళితే ఖరీదైన వైద్యం కూడా ఉచితంగా అందుబాటులోకి వచ్చిందని సంతోషంగా చెప్పారు. అర్బన్ హెల్త్ సెంటర్లను సైతం టీడీపీ హయాంలో నిర్లక్ష్యం చేశారని, నేడు తమకు అందుబాటులోకి వచ్చి మంచి మందులు సైతం లభిస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని శచీదేవి మాట్లాడుతూ ప్రతి మహిళను చైతన్యం చేయాలనేదే తన కార్యక్రమం ఉద్దేశమన్నారు. వాస్తవాలు తెలుసుకోవడం ద్వారా విజ్ఞత ప్రదర్శించాలన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వాస్తవ సమాచారం వారికి అందుతుందని, తద్వారా సామాజిక మాధ్యమాలు, ప్రసార మాధ్యమాలలో వచ్చేవాటిని భేరీజు వేసుకుంటూ ముందడుగు వేస్తున్న ప్రతి మహిళకు కృతజ్ఞతలు తెలిపారు. నమ్మకం, నిజం గెలుస్తుందనే భరోసా లభిస్తుందని, తద్వారా వాసన్న విజయం ఖాయమని తేలుతుందని అన్నారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేయడం ద్వారా మాత్రమే తమకు సంక్షేమ పథకాలు అందుతాయని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ వెన్నపూస కుమారి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు పల్నాటి రవీంద్రారెడ్డి, భూమిరెడ్డి రవణమ్మ, పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, నితిన్‌రెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి, పిల్లి శ్రీనివాసరెడ్డి, తిరుపతిరెడ్డి, రంగిరెడ్డి రామిరెడ్డి, ఉండేల శ్రీనివాసరెడ్డి, సాహిత్య అకాడమీ డైరెక్టర్ బొప్పరాజు జ్యోతి, మహిళా విభాగం జిల్లా, నగర అధ్యక్షులు తమ్మినేని మాధవి, చింతగుంట్ల సువర్ణ, కార్పొరేటర్ గోలి లక్ష్మీకోటేశ్వరమ్మ, శ్రీదేవి, ధనలక్ష్మి, దుగ్గిరెడ్డి ఆంజనేయరెడ్డి, వల్లెపు మురళి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించండి

- మంత్రి మేరుగు నాగార్జున కుమారుడు చందన్



అన్నంగిలో ప్రచారం నిర్వహిస్తున్న మేరుగు చందన్

మద్దిపాడు: వైఎస్సార్ సీపీని రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని మంత్రి మేరుగు నాగార్జున కుమారుడు చందన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం మద్దిపాడు మండలంలోని అన్నంగి గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యేగా మేరుగు నాగార్జునను, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను ఫ్యాన్ గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, సీనియర్ నాయకులు తేళ్ల పుల్లారావు, సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి అన్వేష్, ఎంపీటీసీ సభ్యురాలు రాయపాటి వెంకట సుజాత రమేష్, రాయపాటి వెంకట సుబ్బయ్య, తన్నీరు అంకమ్మరావు, సచివాలయ కన్వీనర్ వేముల సుబ్బారావు, దుడ్డు వినోద్, అంబటి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పెళ్లూరులో బాలినేని పర్యటన

ఒంగోలు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఒంగోలు 17వ డివిజన్‌లోని పెళ్లూరులో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు కటారి శంకర్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు నగరంలోని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి బడుగు ఇందిర ఇంటివద్ద ఆత్మీయ అల్పాహార విందులో పాల్గొంటారు. అనంతరం 9 గంటలకు పెళ్లూరు చేరుకుని ప్రచారం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు స్థానిక 45, 49 డివిజన్లలో ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు ఈస్టర్ సందర్భంగా నగర మేయర్ గంగాడ సుజాత నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరవుతారు. సాయంత్రం 5 గంటలకు మళ్లీ పెళ్లూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు.

స్పెషల్ పీపీగా పీవీ రెడ్డి



పీవీ రెడ్డి

ఒంగోలు: డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ కేసులకు సంబంధించి స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)గా పీవీ రెడ్డి నియమితులయ్యారు. 16 సంవత్సరాలుగా అడ్వకేట్‌గా ఆయన పనిచేస్తున్నారు. స్థానిక ఒకటో అదనపు జిల్లా జడ్జి శివకుమార్‌ను కలిసి బాధ్యతలు స్వీకరించారు. నెలకు రూ.40 వేల గౌరవ వేతనంతో 3 సంవత్సరాలపాటు ఈ బాధ్యతలు నిర్వహిస్తారు. గతంలో కూడా ఇవే బాధ్యతలను ఈయన నిర్వహించారు. ఈ నెల 28వ తేదీతో గడువు ముగియడంతో మళ్లీ రెన్యువల్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో శనివారం బాధ్యతలు స్వీకరించారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

- కార్మికశాఖ కమిషనర్ భవాని

ఒంగోలు టౌన్: రోజురోజుకూ ఎండలు పెరిగిపోతున్న నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు యాజమాన్యాలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సహాయ కార్మికశాఖ కమిషనర్ కె.భవాని కోరారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. వివిధ పరిశ్రమలు, నిర్మాణ పనులు, షెడ్ల నిర్వహణ యజమానులు వారి వద్ద పనులు చేసే కార్మికుల ఆరోగ్య రక్షణకు వైద్యపరంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వడగాడ్పుల నుంచి కార్మికులు ఉపశమనం పొందేందుకు పని చేసే ప్రాంతంలో ఓఆర్ఎస్, మజ్జిగ, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే, ఉదయం 12 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే పనులు చేయించుకోవాలని సూచించారు. ఆ మేరకు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామని భవాని హెచ్చరించారు.

గురుకుల పాఠశాల ప్రవేశాల గడువు పొడిగింపు

చీమకుర్తి: ఏపీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకునే గడువును మార్చి 31 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా గురుకుల పాఠశాలల కన్వీనర్, సంతనూతలపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డీ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంతనూతలపాడు, అమ్మనబ్రోలు, గణపవరం పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశం కోసం, 6, 7, 8 తరగతులలో మిగిలిన ఖాళీల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. వాటితో పాటు రాష్ట్రంలోని 7 గురుకుల జూనియర్ కాలేజీలల్లో జూనియర్ ఇంటర్ ప్రవేశంతో పాటు నాగార్జున సాగర్‌లోని డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

యోగా సాధనతో పరిపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ దినేష్‌కుమార్



ప్రశంసపత్రాలు అందుకున్న వారితో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు టౌన్: ధ్యాన యోగా సాధనతో పరిపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అన్నారు. స్థానిక రంగరాయుడు చెరువులోని గాంధీ పార్కు ఆవరణలో పదేళ్లుగా నిత్యం యోగా, ధ్యాన సాధన చేస్తున్న యోగా సాధకులకు శనివారం ప్రశంసపత్రాలు అందజేశారు. ఇటీవల 108 సూర్య నమస్కారాలతో రికార్డు సృష్టించిన యోగా సాధకులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాతో మానసిక ఆరోగ్యం కూడా సాధ్యమవుతుందన్నారు. మానసిక ఒత్తిడి, ఆందోళన నుంచి బయటపడి ప్రశాంతంగా జీవించవచ్చన్నారు. ప్రస్తుత ఉరుకులు, పరుగుల ఆధునిక జీవితంలో ఆరోగ్య పరిరక్షణకు సమయం లేకుండా పోయిందని చెప్పారు. అయితే, ప్రతిఒక్కరూ యోగా లాంటి మెడిటేషన్ అలవాటు చేసుకోవడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని సూచించారు. యోగా శిబిరం నిర్వాహకుడు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్కు ప్రాంతంలో యోగా సాధనకు అనుమతిస్తే ఒక షెల్టర్ ఏర్పాటు చేసుకుంటామని కోరారు. కార్యక్రమంలో మురళి, శ్రీనివాస్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో పశువులు జాగ్రత్త



రైతులకు మందులందిస్తున్న జేడీ బేబీరాణి

నాగులుప్పలపాడు: పశుపోషణలో రైతులు సరైన పద్ధతులు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డా.బేబీరాణి సూచించారు. శనివారం ఈదుమూడి గ్రామంలో పశుపోషకులు పాటించాల్సిన జాగ్రత్తలపై జేడీ అవగాహన కల్పించారు. వేసవిలో పశువులకు చల్లటి వాతావరణాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అంటువ్యాధులు రాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రైతుల కోసం నిరంతరం చలివేంద్రాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా 40 శాతం సబ్సిడీపై మేత కోసే యంత్రాన్ని కొండ్రుగుంట వెంకటేశ్వర్లు అనే రైతుకు జేడీ అందజేశారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన ద్వారా 70 శాతం రాయితీపై మెలతోటి వెంకట రమణకు అందించిన గేదెలను పరిశీలించి తగు వైద్య సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ అనూరాధ, సహాయకులు రంగనాథ్, హరిత, రామకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

సీఏఏ ఉపసంహరించేంత వరకు పోరాటం

ఒంగోలు టౌన్: దేశ ప్రజల మధ్య విద్వేషాలు రాజేసే ప్రమాదకర పౌరసత్వ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకునేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిరంకుశ సీఏఏ చట్టాన్ని వెంటనే ఉపసంహరించాలని కోరుతూ శనివారం నగరంలో సీపీఐ, సీపీఎం, ముస్లిం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శాంతియుత నిరసన ప్రదర్శన నిర్వహించారు. పాత కూరగాయల మార్కెట్ వద్ద గల మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో శ్రీనివాసరావు ప్రసంగిస్తూ దేశంలో కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజలను చూసి ఓర్చుకోలేకనే మతరాజ్యాన్ని స్థాపించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశాన్ని మతరాజ్యంగా మారిస్తే అంగీకరించేది లేదన్నారు. ముస్లిం హక్కులను కాపాడతామంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొడుతున్న చంద్రబాబు సీఏఏకు వ్యతిరేకంగా ఎందుకు నోరుమెదపడం లేదో ఆలోచించాలన్నారు. తమ పార్టీ తరఫున పోటీ చేసేందుకు ముస్లింలకు కనీసం ఒక్కసీటు కూడా ఇవ్వని జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ మోదీ మతతత్వ పాలన గురించి ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలన్నారు. కేంద్రంలోని నిరంకుశ మోదీ ప్రభుత్వం ముందు మోకరిల్లుతున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు సీఏఏ పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, డీసీసీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ముస్లిం ప్రజాసంఘాల నాయకులు వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

మృత్యుంజయుడు.. ఏసుక్రీస్తు



రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఒంగోలు టౌన్: కల్వరి శిలువ మీద మరణించిన ఏసుక్రీస్తు సమాధి చేయబడిన మూడో దినాన మృత్యుంజయుడైన సందర్భానికి గుర్తుగా ప్రతి ఏడాది రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాస్టర్ డి.జాన్‌అగస్టిన్ తెలిపారు. శనివారం నగరంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి నుంచి అద్దంకి బస్టాండ్, బండ్లమిట్ట, గాంధీరోడ్డు మీదుగా చర్చి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. తేళ్ల ఇమ్మానుయేల్ అధ్యక్షత వహించిన ఈ ర్యాలీని పాస్టర్ అగస్టిన్ ప్రార్థనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు డి.అషేర్‌పాల్, ఎస్.ఐజాక్‌బాబు, జి.భగవాన్‌దాస్, ఆర్.జోసెఫ్, క్రిష్టఫర్, వై.స్వరూప్‌కుమార్, పి.జెరుషా, కె.డేనియల్, డి.ఆశీర్వాదం, ఐ.ఫ్రాంక్లిన్, టి.తిమోతి, ఎం.ప్రేమ్‌కుమార్, కూచిపూడి శరత్, విజేష్ రాజ్, చర్చి కమిటీ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

జనసేనకు మండల ఉపాధ్యక్షుడు రాజీనామా

నాగులుప్పలపాడు: జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఊదరగుడి స్టాలిన్‌బాబు తన పదవికి శనివారం రాజీనామా చేసినట్లు తెలిపారు. కొంతకాలంగా జనసేన జిల్లా నాయకత్వం, నియోజకవర్గ నాయకత్వం పనితీరు బాగలేదని, ఇలాంటి పార్టీలో కొనసాగడం ఏమాత్రం ప్రజాస్వామ్యం కాదని అనిపించడంతో రాజీనామా చేసి ఆ పత్రాన్ని జనసేన మండల అధ్యక్షుడితో పాటు జిల్లా కార్యాలయానికి కూడా పంపినట్లు తెలిపారు. ఏ పార్టీలో చేరాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

ఆలూరు (కొత్తపట్నం): పొగాకు బ్యారన్ దగ్ధమై రూ.4 లక్షల విలువ చేసే పొగాకు, బ్యారన్ సామగ్రి కాలిపోయిన సంఘటన కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పల్లప్రోలు సతీష్‌రెడ్డి పొగాకు బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా, ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా, ఫలించలేదు. ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసింది.